

# బినామి

కె.ఎన్. మల్లీశ్వరి

ఆ రోజే మద్దిరావమ్మ సంబరం. పొరుగూళ్ల నుంచి వచ్చిన చుట్టాలతో నిండిపోయి ఊళ్లో యిళ్లన్నీ విరగకాసిన వేరుశెనగ గుత్తుల్లా ఉన్నాయి. పెరళ్లలో పూలతోటలన్నీ కళ్లింతలు చేసుకుని సంబరం చూడడానికి వీధిగుమ్మాల్లో పొందిగ్గా కూచున్నట్టు రంగురంగుల ముగ్గులు.

వాళ్లమ్మతో పాటు చీకట్నే నిద్రలేచి పొదీషనుగా తలంటుస్నానం చేసేసింది బుజ్జి. తల తుడుస్తుంటే చారుమతి నడుం చుట్టూ చేతులు చుట్టి తలెత్తి మొహంలోకి చూస్తూ, "అమా... అమా... ఇవ్వాళ కూడా మనిద్దరమేనా? మనింటికెవరూ రారా?!" దిగులుగా అడిగింది. చారుమతి విననట్లుగా మొహం పెట్టి తల తుడిచిన పాత చీరను గట్టిగా దులిపి తీగ మీద ఆరేస్తూ, "జుట్టిరబోసుకుని బైటకు వెళ్లమాకు. తలారేవరకూ వరండాలో నిల్చో," అంది.

బుజ్జికి కోపం వచ్చింది.

నడుస్తుంటే గొడుగులా విచ్చుకుంటున్న తుఱ్ఱుపిట్ట రెక్కల రంగు పట్టులంగా కుచ్చిళ్లను విసురుగా తన్నుకుంటూ వరండాలోకి వచ్చింది. వరండా చీడీలకి కుడిచేతి వైపునున్న పూలమొక్కలు రమ్మని తల లూపాయి. సీతమ్మవారి జడబంతుల మొక్క దగ్గరికి వెళ్లి ఒక పువ్వుమీదికి మొహం వంచి, "స్నానం చేశావా?" అంది. మొఖమల్ మెరుపుల పువ్వు గాలికి వయ్యారంగా వూగింది.

"చేసేశావా? సరే. ఓయ్ ఒంటిరెక్క మందారం... రాధాకృష్ణ పూలచెట్టూ... విరజాజులూ... కనకాంబరాలూ... శంఖుమల్లీ... ఇట్టారండి... ఇవాళ సంబరం కదా! జాంచెట్టు పిన్నివాళ్లింటికి వెళ్లి ఆడుకుందాం పదండి," బుజ్జి పిలవంగానే పువ్వులన్నీ వొచ్చి ఒళ్లో వాలాయి. వీళ్లను చూడగానే జాంచెట్టు పిన్నిగారు నీడ చాప పరిచి జాంపళ్ల ఫలహారం పెట్టింది. అరగంటసేపు బహుపూలపాత్రాభినయం చేసేసరికి విసుగొచ్చి గభాలున లేచి వంటింట్లోకి పరిగెత్తి, "అమా... జుట్టారిపోయింది," అంది.

"జడేస్తాను పా... దువ్వెన తెచ్చుకో," ఉత్తరపేపు గుమ్మం పైమెట్టు మీద కూచుంది చారుమతి. దువ్వెన, రిబ్బన్లు, కాటుక, ఎనిమిది రంగుల తిలకం బాక్సు తెచ్చుకుంది బుజ్జి.

జుట్టు చిక్కులు తీస్తూ, "పెళ్లయిన ఎన్నో ఏళ్లకి ఎన్నో పూజలు చేస్తే నువ్వు పుట్టావు. నువ్వు యింతున్నపుడు మీ నాన్న పోయాడు. వూరంతా అప్పులే... అన్నీ పోనూ ఏం మిగిలింది? ఈ రెండెకరాలు తప్ప! ఏలూర్లో కాపరం పెట్టమన్నారంతా... ఆళ్లమాటే యినుంటే ఈ పాటికి అయిక్కిమనిపోయేవాళ్లం. అల్లాలూ బిల్లాలూ చేసి, వున్నది కూడా కాజేత్తారని చుట్టాలెవరినీ జేరనివ్వడంలా." చారుమతి చెప్పేదంతా బుజ్జికి కంఠోపాఠమే. సగం సగం వింటూ రిబ్బన్ని గులాబీపువ్వులా చేయడానికి మడతలు పెడుతోంది.

"నీకు ఒంటిమీదికి ఎనిమిదేళ్లు వచ్చాయి. లొడబుచ్చకాయలా వాగుతూ అటూ యిటూ తిరక్కూడదు. అమ్మ చెప్పినట్లు వినాలి. అంతో యింతో చదువు చెప్పించి, నీ పెళ్లిగానీ చేశానంటే, అదుగో... మొగుడు లేకపోయినా చారుమతి కూతురు పెళ్లి ఘనంగా చేసింది అనుకోవాలందరూ." జుట్టుని ఈతపాయల జడేసి

రిబ్బను కుచ్చులు పోస్తూ అంది చారుమతి. ఎప్పటిలాగే తలూపింది బుజ్జి.

ఎడంచేత్తో లేతబుగ్గలు రెండూ ఒత్తి చూపుడు వేలుతో కింది రెప్పలాగి, కుడిచేతి ఉంగరం వేలితో అత్తారుబతంగా కాటుక దిద్దుతుంటే చారుమతి వీపు చుట్టూ చేతులు వేసి, నొక్కుకుపోయిన బుగ్గలతోనే, "అమా షుట్టాలెవలూ... లాలా? నిజ్జమేనా?" దింపుడు కళ్లం ఆశలా మళ్లీ అడిగింది.

విసుగ్గా చూసింది చారుమతి.

"పాడిందే పాటరా... పాచిపళ్ల దాసరా... అని అదే పట్టుకుంటావే. ఆయశుద్ధమయిన మాటొక్కటి రాదు నీకు." వేలికి మిగిలిన కాటుక తలకు రాసుకుని, బుజ్జి తల మీద గట్టిగా మొట్టి, "వెళ్లు... వెళ్లి ఆడుకో ఫో..." అంది.

కాటుక కళ్ల నుంచి కన్నీటిబొట్లు బుగ్గల మీదకి టపటపా జారాయి. "ఎవళ్లతో ఆడుకోవాలీ...?" గట్టిగా అరిచి పరిగెత్తుకుంటూ వరండాలోకి వచ్చింది. ఓ పక్కగా ఎండుగడ్డితో చుట్టలు చుట్టిన ఎంటిక్కాయ కనిపించింది. కసిగా కాళ్లతో తన్నుతూ, దొర్లిస్తూ, వడ్లపురి చుట్టూ తిరిగింది కాసేపు.

చారుమతి తెచ్చిచ్చిన పాలు బుద్ధిగా తాగేసి, మూతి శుభ్రంగా తుడుచుకుంటూ, "అమా... మరీ... సరోజిని వాళ్లింటికి వెళ్లి కూసేపు ఆడుకుని ఎమ్మటే వచ్చేత్తానేం?" లయగా కాదనడానికి నోరు రానంత జాలిగా అడిగింది మళ్లీ.

"అక్కడికెందుకే? ఆళ్లు పిండొంటలబట్టీ పెట్టారు. మళ్లా మీ అమ్మేం వండిందని కూపీలు లాగుతారు. వద్దులే... అయిమావతి వచ్చిందేమో అమ్ములత్తని అడుగు. పనయ్యాక అలా బైటకి తీసికెళుతుంది."

ఖాళీగ్లాసు తీసుకొని లోపలికి వెళ్లిపోయింది చారుమతి.

అయిమావతి పక్కింటి అమ్ములత్త వాళ్లింట్లో పైబాట్లకి చేస్తుంది. పెళ్లయి కాపురానికి వచ్చింది లగాయితు ఇరవయ్యేళ్లుగా ఆ యింట్లోనే పొద్దుట్నుంచీ సాయంత్రం దాకా రాట్నంలాగా ఆపనీ ఈపనీ చేస్తూ నమ్మకంగా ఉంటోంది. ఆళ్లాయన ఎల్లమంద నేతపని బాగున్నపుడు బాగానే వుండేవాడు. తర్వాత తాగడానికి డబ్బు లేనప్పుడే కూలికి వెళతాడు. మిగతా టయిమంతా సాలిపేట మర్రిచెట్టు కింద చీట్లాట కాలక్షేపం చేస్తాడు.

రోజులాగే పిట్టగోడకి యివతలున్న రోటిమీదకి ఎక్కి గోడమీదుగా అమ్ములత్త వాళ్లింటివైపు చూసింది బుజ్జి. విశాలమైన మండువా లోగిలి యిల్లు. యింటికి వంటింటికి మధ్య నాపరాళ్ల చప్టా. రోజూ పొద్దున్నే అయిమావతి అక్కడే చల్లగుంజకి కట్టిన మజ్జిగ కవ్వానికున్న తాడు రెండు కొసలు పట్టి ముందుకీ వెనక్కీ లాగుతూ-

*కాశికెడదామంటే కదలవే నా కాళ్లూ...*
*ఢిల్లి కెడదామంటే తిరగదే నా మనసూ...*
*అదె నా రాచ పుట్టింటికెడదామూ అంటే*
*నాకాళ్లు పన్నిన్న రథములై నడుచు*
*నా చేతులుయ్యాల చేరులై వూగు...*

అంటూ వెన్న రాసిన గొంతుతో పాడుకుంటూ ఉంటుంది. చిలుకుడు పని అవ్వగానే ఉసిరికాయంత వెన్నముద్ద తెచ్చి పిట్టగోడకు పూసిన చందమామ నోట్లో పెడుతుంది. గుటుక్కున మింగేసి, "ఎపుడూ ఇదే పాట పాడతావేంటీ?" అంటుంది బుజ్జి. "మా అమ్మోళ్లింటికి వెళ్లి ఏడు సమ్మచ్చరాలు అయింది బుజ్జమ్మా!" అంటుంది. అపుడుగానీ అయిమావతి గొంతు వింటే గొడ్లసావిడిలో గేదె పొదుగు నుంచి బలవంతంగా లాక్కెళుతున్న పెయ్యిదూడ అరుపులా ఉంటుంది.

ఒకసారి మాత్రం, "ఎందుకు వెళ్లలేదు ఇన్ని సమ్మచ్చరాలు!! పోనీ మా ఇంటికి రా," దయగా అంది బుజ్జి.

అయిమావతి అటూ ఇటూ చూసి కాళ్లు ఎత్తెత్తి వేస్తూ చప్పుడు కాకుండా గోడ దగ్గరకి వచ్చి, "నా యమ్మే," అంటూ బుజ్జి బుగ్గలు చిదిమి మెటికెలు విరిచి గొంతు తగ్గించి రహస్యంగా దీనంగా తన బాధలన్నీ చెప్పుకుంది.

"కుమ్మరోడింట్లో కుండలుంటే వంద మందొచ్చి మోగిత్తారు గదా. ఎల్లమంద తీరవ మంచిదికాదు బుజ్జమ్మా. ఆడు చెప్పినట్టు ఇనలేదని ఎక్కడికీ పంపడు. ఓపాలి మాయమ్మకి పురుగు ముట్టేసి ఒళ్లంతా నల్ల కప్పి రేసిపోయి నోటంట కుండడు నురగ కారిపోయిందంట. లబోదిబోమని లగెత్తబోతే, ఆ ఫలాణా చెయ్యట్టుకు లాక్కుబోయి, 'అమ్మాలేదు బొమ్మాలేదూ కదిల్తే కాళ్లిరుగుతాయి,' అనేసి ఒంటికి దూలగుండాకు పట్టి బలవంతానా రాసేసి గుడిసెలో పెట్టి తాళం వేసి బయట కూచ్చున్నాడు. దురద తట్టుకోలేక ముళ్లకంప మీద పడుకున్నట్టు ఒళ్లంతా గోక్కుని గెంతులేస్తూ ఆడిని తిడుతుంటే వచ్చినోళ్లందరికీ దానికి మతిలేదు అని చెప్పేవాడు. వాళ్లేమో, 'అమ్మ కింద పని చేయబడతదని ఎగ్గొట్టే ఎత్తులు వేత్తంది. అమ్మో!! అయిమావతి దేవాంతకురాలు,' అనేవాళ్లు. కడుపున కాసిన అమ్మకి కానివ్వ

కుండా జేత్తన్నాడు గదాని నేనేడుత్తుంటే ఈ రకం నిందలు!!'' అంటూ అయిమావతి ఉక్కిరిబిక్కిరి అయిపోతుంటే బుజ్జికి ఏంచేయాలో తోచక నాలుగు జాంపిందిలు తెంపి తెచ్చి అయిమావతి ఒడి నింపింది ఆరోజు.

అమ్ములత్త వాళ్లింట్లో చుట్టాల హడావిడి కనిపిస్తోందిగానీ అయిమావతి అలికిడి లేదు. కాసేపు చూసి, "అయిమాతీ... అయిమాతీ..." పిలిచింది బుజ్జి.

ఎవరూ పలకలేదుగానీ ఒకటిన్నర అడుగుల ఎత్తుతో, ఏడుమొగ్గల ఎర్రని తురాయి ఉన్న గోధుమ మచ్చల పందెం కోడిపుంజు తిరగడం ఆపి, కాళ్లు నేలకి నిగడదన్ని మెడ దగ్గర ఈకల్ని విదిలించి బుజ్జిని అనుమానంగా చూసింది. రెండు మట్టిపెడ్డలు తీసుకుని దానిమీదకి విసిరి, "పోవే కోడిముండా..." కోపంగా అంది బుజ్జి.

ఇంతలో పెదబాబు మావయ్య బైటికొచ్చి కోడిపుంజునెత్తుకొని మెడ ఈకలు దువ్వి, "యావే బుజ్జీ! మారాజు పుంజుని మట్టిబెడ్డల్తో చంపేద్దావనే!'' గోరోజినంగా అన్నాడు.

''అయిమాతి...'' బిక్కుమని చూస్తూ అంది. పెదబాబు మామయ్య వెనకాలే వచ్చిన అమ్ములత్త,

"ఆ! అయిమాతీ... చట్టుబండలూ... పనున్నరోజే ఎగ్గొట్టినట్టుంది.చూడూ... ఏడ్చినదానికీ మొగుడొత్తాడు... ఏడ్వనిదానికీ మొగుడొత్తాడు అన్నట్టు యిద్దరిపనీ అవుతుంది. వెళ్లి అయిమావతిని పిల్చుకురా," అంది.

''మా అమ్మ తిట్టద్ది,'' చక్రాల్లాంటి కళ్లు భయంగా తిప్పింది బుజ్జి.

"మీ అమ్మకి నే చెప్తాలే. పో..."

కాళ్లకి అపుడే జీవం వచ్చినంత ఉత్సాహంగా రెండుచేతుల్తో పట్టులంగా కొద్దిగా పైకి ఎత్తి పట్టుకుని రోటిమీది నుంచి ఒక్క దూకు దూకి, ఎగిరి మండిగాలు దాటుకుని, వరండా మెట్ల మీద చకచకలాడి వీధిగుమ్మం తగలకుండా బైటకి గెంతి, నీటిబోదెలోకి అకస్మాత్తుగా వదిలిన పిల్లనీటి పాయలా జలజలలాడుతూ క్షణంలో నందుమొగకి, మరుక్షణంలో అయిమావతి యింటికి చేరుకుంది బుజ్జి. అలవాటుగా ఎగిరి చూరు కున్న ఎండుతాటాకును తెంపుతుంటే లోపల్నుంచి గట్టిగా ఏవో మాటలు వినబడి తుళుక్కుపడి పక్కనున్న మట్టి అరుగును ఆనుకుని నిలబడిపోయింది.

"ఇదిగో మీ చెల్లిగాని నీతో వత్తానంటే సుబ్బరంగా తీసికెళ్లు. నాకేం మనేద లేదు. కానీ తిరిగి రానక్కరలేదు. అక్కడే అట్టిపెట్టుకోండి. మొదలే బిడ్డాగడ్డాలేని గొడ్డుమోద్దీ,'' ఎల్లమంద అయిమావతి వాళ్లన్నతో తెగేసి చెపుతున్నాడు.

''అవునయ్యో గద్దరిబావో! మంచానబడ్డ మీ అమ్మాబాబుల్ని, పైసా యింట్లో కివ్వని నిన్నూ బిడ్డల్లా సాకుతోంది గదా గొడ్డుమోద్దే మరి! ఏడేళ్లాయి మా అడ బిడ్డని మాకు గాకుండా చేశావు. యిపుడు సంబరానికి కూడా తీసికెళ్లనివ్వడం లేదు... అసలకి పెదబాబుగోరు మిమ్మల్ని నమ్మేకదా పొలం అయిమావతి పేర్నపెట్టారు. తర్వాత అడిగినపుడు ఆరి పొలం ఆరికి రాసివ్వకుండా బిగేయడం ధర్మమా? నీదిగాని సొమ్ము అమ్ముకు తింటానంటావ్... అది నాయమా? సంతకం పెట్టనంద నేసి మా చెల్లిని నానా బాదలు పెడుతున్నావు. రాజా రాజా నీ రాజరికం మానతావా నీ వాజ (వాదం) మాన తావా అంటే నా రాజరికం అయినా మానతాగానీ నా వాజ మాత్రం మాననన్నాడట వెనుకటికి ఒకడు. అట్టా వుంది నీ యవ్వారం. అసలకి ఆళ పొలం మీద నీకేం కర్తీకం ఉందని యిదంతా?'' నిష్ఠూరంగా అన్నాడు అయిమావతి అన్న.

"అన్నో! కర్తీకవో... కట్టుబండలో... యిరవయ్యేళ్ల నించి ఆ ఇంట్లోబడి రెక్కలు ముక్కలు చేసుకుంటూనే వున్నాను. ఆళకున్న ముప్పయ్యొకరాలకి... సింద.. .ఈ మూడెకరాలు ఒక లెక్కా? నాయం, దర్మం, కర్తీకం నిర్ణయం జెయ్యడానికి మన మెవళం? పొలం అమ్మేసి వూరొదిలి పారిపోదావంటాడు మీ బావ. నా పేర్న పొలం పెట్టినా ఒక్క గింజ దాన్లోది తిన్న పాపాన బోయామా? పొలం అమ్మేసుకుంటే పెదబాబు గోరు సూత్తా వూరు కుంటాడా? సంపేసి శవం జోబీలోంచయినా లాగేసు కుంటాడు,'' అయిమావతి మాట్లాడుతుంటే పళ్లు పటపటలాడిస్తూ కూర్చున్న ఎల్లమంద చివాలున లేచి,

"నియ్యవ్వ... యిదంతా పెదబాబుగోరి మీద జడుపే? వలపులు బోతున్నావు గదే వలపులు,'' జుట్టు పట్టి వంగదీసి వీపుమీద గుద్దేడు. నేల మీద పడేసి కాళ్లూ చేతుల్తో తన్నుతుంటే అన్న అడ్డుపడబోయాడు. విసిరి కొట్టాడు ఎల్లమంద.

''నేను అసుమంటిదాన్ని గాదు,'' అయిమావతి దీనంగా ఏదో అనబోతుంటే లాగిపెట్టి మూతిమీద కొట్టాడు.

బొలబొలా రక్తం కారిపోయింది. అరుపులు, ఏడుపులు, పెడబొబ్బలతో ఇల్లంతా గల్లంతుగా గోల

గోలగా అయిపోయింది. అన్న తన గుడ్డల సంచి తీసు కుని, "తల్లో! నీ మొగుడికో దండం, ముక్కదెప్పుళ్లతో ఆగేరకంకాదు ఈడు. నేనున్నానంటే నన్ను అడ్డుపెట్టు కుని నిన్నింకా సంపుకు తింటాడు," రెండు చేతులెత్తి దండం పెడుతూ బయటికి పరుగుతీశాడు.

అయిమావతి అసాసురాలయిపోయింది. "అన్నో! నన్ను వొదిలి ఎల్లకురో, నేనూ నీతో వత్తాను. అమ్మని జూడాలిరో..." ఎల్లమందని తప్పించుకుని లబలబ లాడుతూ బయటకొచ్చి ఉయ్యాల చేరుల్లా ఊగుతున్న చేతుల్తో అన్న వెనకమాల పరిగెత్తింది.

అప్పటికే రోడ్డెక్కి వడివడిగా వెళ్లిపోతున్నాడు అన్న. ఆయిలో ప్రాణం సోయిలోకి వచ్చినట్టయి నేల మీద కూలబడి తల బాదుకోబోయి బిత్తరచూపులతో గోడకి అంటుకుపోయిన బుజ్జిని చూసి టక్కున ఆపే సింది అయిమావతి.

నల్లమేఘాలతో ఉబ్బిన ఆకాశంలాంటి మొహం, నెత్తుటి నిప్పులు గక్కుతున్న నోరు, చీకట్లో వూగుతున్న చెట్లనీడల్లా ఎదమీద, భుజాల మీద పరుచుకున్న జుట్టు... అయిమావతిని చూసి బెదురుగా రెండడుగులు వెనక్కివేసి, "అమ్ములత్త..." మిగతా మాటల్ని గుటకవేసి మింగుతూ అంది బుజ్జి.

మౌనంగా లోపలికి వెళ్లి పదినిమిషాల్లో బైటకి వచ్చింది అయిమావతి. జుట్టు ముడివేసి మొహం కడు క్కుంది. బుజ్జికి కొంచెం ధైర్యం వచ్చి అయిమావతి దగ్గరికి చేరింది. ఇద్దరూ చేతులు చేతులు పట్టుకుని బైలుదేరారు. నడుస్తూ మధ్య మధ్య అయిమావతి మొహంకేసి చూస్తోంది బుజ్జి. అకస్మాత్తుగా ఏ మాంత్రి కుడో వచ్చి ఇందాకటి అయిమావతిలా మార్చేస్తాడా అన్నంత భయంతో చూస్తోంది. అయిమావతిలో గడ్డ గట్టిన మౌనం. ఎప్పట్లా కవుర్లూ, కతలూ, నవ్వులూ లేవు. మొహం బిగదీసుకుని అట్లా ఉండడం బుజ్జికి నచ్చ లేదు.

"ఈతపాయల జడేసింది మా అమ్మ," కలక దెలుపుతూ అంది బుజ్జి. జడ పట్టుకుని చూసి తలూ పింది. అదే మొహం, వానకి ముందు ఉమ్మరింపులా...

దిగాలుగా నడుచుకుంటూ అమ్ములత్త వాళ్లిం టికి చేరారు. వీధరుగు మీద నలుగురయిదుగురు రైతు లతో కలిసి కూర్చున్నాడు పెదబాబు. అయిమావతిని చూడగానే కళ్లెగరేసి, "వచ్చావెట్టా?! నాపసానిలాగా చీర కుచ్చిళ్లు జారిడిసి పన్లోకొచ్చావ్. అయినా నెరవతక్కువ చీరలు కట్టే ఖర్మ నీకేంట్లే? మూడెకరాల ఆసామివి కదా," ఎకసెక్కెంగా అన్నాడు. పక్కనున్నోళ్లు గొల్లున నవ్వారు.

ఆ వజాన అయిమావతి నిల్చున్నపాటుగా నిలు వెల్లా జలదరించడం చేతుల లంకెలోంచి గ్రహించింది బుజ్జి. పెదబాబు మావయ్య ఏవన్నాడో అర్థం కాక పోయినా చెడ్డగా ఏదో అన్నాడని మాత్రం అర్థమయింది బుజ్జికి. పెదవి దాటని మాటలేవో గొణుగుతూ చీర కుచ్చిళ్లు బొడ్డున దోపి లోపలికి అడుగేసింది అయి మావతి.

వరండాలోంచి అమ్ములత్త, "వచ్చా?... బక్క చుక్కలు గుంకి బడాయి చుక్క పొడిసింది. అమ్మగారు తెమిలి వచ్చేసరికి," చేతులు బార్లాజాపి గయ్యిమంది.

"ఎల్మంద అయిమాతిని కొట్టాడు," ఎవరి మీద ఎందుకు కోపమో అర్థంకాక ఉక్రోషంగా అంది బుజ్జి.

బయటి లోపలి గాయాల అయిమావతిని తేరి పార చూసింది అమ్ములత్త. "ఆ! ఆ!... వేలు మీద గోరు మొలిత్తే గోల్కొండ వరకు జాబులెల్లాయంట. మొగు డేదో యిట్టా అంటేనే వాసి మొక్కోయిందా? మరి మా బాధలు కడతేర్చేది. ఎవరు? హమ్మా... హమ్మా... వందా రెండొందలూ గాదు... మూడెకరాల పొలం... ఎవరు తిన్నట్లు! నమ్మి నెత్తిన పెట్టుకుంటే తిన్నయింటి వాసాలు లెక్కబెట్టినట్లు ఏడేళ్ల నుంచీ మొగుడూ పెళ్లాలిద్దరూ నాటకాలాడుతున్నారు గదా? ఇదిగో రాసేత్తాను, అదిగో రాసేత్తానంటది. రిజిస్టాపీసుకి రమ్మంటే కదల్దు. పండగ పూట మా యింట నవ్వు లేకుండా చేసావుగదే! కులానికి పేదయినా గుణానికి పేదకానోళ్లని యింతమందిని చూశాం." బొయోబొయోలాడుతున్న అమ్ములత్త, అమ్ములత్తలా కనపడలేదు బుజ్జికి.అపుడు ఆమె తనలా లేదు అయిమావతిలా లేదు. అమ్మలాగా కూడా లేదు. పాలేరు బుడ్డోడిని బండబూతులు తిడుతున్నపుడు పెద బాబు మావయ్య మూతిమీద అసహ్యంగా కదిలే మీసంలా వుంది అమ్ములత్త.

పొదుగు బరువుతోపాటు కాడి బరువు కూడా మోయాల్సి వచ్చిన నిస్సహాయమైన ఆవులా కాళ్లీడ్చు కుంటూ లోపలికెళ్లి పనులు అందుకుంది అయి మావతి. బుజ్జి యింటికి వచ్చేసినా మధ్య మధ్య పిట్టగోడ మీద మొహం వాల్చి అక్కడేం జరుగుతుందో మూగగా చూస్తూనే వుంది. రోజూ పాడే పాట లేదు మాట లేదు. అమ్ములత్త మాత్రం చీకుదోమల్లాంటి మాటల్తో అయి మావతి చుట్టూ ముసురుతూనే వుంది.

సాయంత్రం ఏడుగంటలకి సంబరాలు మొదల వుతాయి. ప్రభ బండి ఎత్తుతారు. దాని వెనక గణాసార్లు, గ్రామదేవతలూ, భక్తులూ వూరంతా తిరుగుతారు. అయిమావతి సాయంత్రం పనయి యింటికి వెళ్లేముందు చారుమతి దగ్గరకు వచ్చింది. సంబరంలో బండి వెనక మాల తిరగడానికి సవాలక్ష జాగ్రత్తలు చెప్పి బుజ్జిని అయిమావతికి అప్పగిం చింది.

అయిమావతి యింటికి వెళ్తూ యిద్దరూ తోవలో వున్న సీమచింత గుబురుల దగ్గర ఆగారు. అలసిపోయినట్లు పక్కనున్న రాయిమీద కూర్చుంది అయిమావతి. ఇంకా గడ్డకట్టిన అదే మొహం. అమ్మ కూడా అపుడప్పుడూ ఇంతే! ఎందుకుంటారో యిట్లా? రాలిపడిన సీమచింతకాయలు ఏరుకుంటూ అనుకుంది బుజ్జి. ఏం చేయాలో తోచక, ఈలోకంలో లేనట్టుగా ఉన్న అయిమావతి చుట్టూ చక్కర్లు కొట్టింది. మొహం లో మొహం పెట్టి చూసింది. బుగ్గలు వాచిపోయి, కింది పెదవి పగిలి నెత్తుటిముద్దలా వుంది. లంగాలో దోపుకొని తెచ్చిన పౌడరు పొట్లం తీసి గాయం మీద నిమ్మిదిగా రాస్తూ,

“అప్పుడు... అప్పుడూ మనమేం జెయ్యాలంటే... ఎంటిక్కాయని గా..ట్టిగా తన్నేయాలి. కోడిపుంజు మీద మట్టిబెడ్డలు యిసరాలి. యింకా అట్టా ఏమన్నా జెయ్యాలన్నమాట. అప్పుడు నెప్పేయదు,” నమ్మకంగా చెప్పింది బుజ్జి.

పొద్దు వాటారుతోంది. ఆ రోజు సూర్యుడి ఆఖరి కిరణం ఆకాశాన్ని ఖాళీచేసి, అయిమావతి మొహంలోకి వచ్చి చేరింది.

*

సాయంత్రం ఏడు గంటలు.

ఇట్టా చీకట్లు కమ్మగానే అట్టా పెట్రోమాక్సు లైట్లు గుప్పున వెలిగాయి. వూరికి ఈ చివరనున్న మద్దిరావమ్మ గుడి నుంచి ప్రభ బండి ఊరేగింపు మొదలయింది. ఆ చివరనున్న గంగాణమ్మ గుడికి చేరేలోపు ప్రతి యింటి వద్దా ఇచ్చే కానుకలూ మొక్కుబళ్లతో బండి నిండిపోతుంది. ఎడ్లబండికి వెదురుబొంగులతో బాగా ఎత్తులో ప్రభని నిలిపారు. ముస్తాబుచేసిన మైసూరెడ్లు మువ్వలు గణగణలాడించుకుంటూ ముందుకు కదిలాయి.

ప్రభబండి ముందు మద్దిరావమ్మ, గంగాణమ్మ, పోలేరమ్మ, చల్లాలమ్మ, మాల్చెమ్మ తల్లులు ఉల్లాసంగా ఆడుతున్నారు. భక్తులు గుగ్గిలం పొగతో వాళ్ల ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తున్నారు. పసుపు, బియ్యప్పిండి కలిసిన బండారు, లైట్ల వెలుగులో పసుపు మేఘంలా కమ్ముకుంది. శూలానికి కొమ్మలూ, రెమ్మలుగా యినప తీగలు కట్టి వాటికి నూనెలో ముంచిన గుడ్డలు చుట్టి వెలిగించిన ‘నారశూల’ దివ్యంగా వెలుగుతోంది. పులేష గాళ్లూ, డప్పులోళ్లూ, వాళ్ల చుట్టూ మూగి చిందేస్తున్న వాళ్లతో వీధులు కిక్కిరిసిపోయాయి.

బండి వెనకమాల గుంపుతో కలిసి నడుస్తున్న బుజ్జి, అయిమావతి మొహాలు మెరిసిపోతున్నాయి. ఆ పూట అయిమావతి మొహానికి పసుపు రాసి యింత పెద్ద కుంకుమ బొట్టుపెట్టింది. చిలకాకుపచ్చరంగు అంచున్న పండు మిరపరంగు నేతచీర కట్టి చేతుల్నిండా రంగు రంగుల గాజులు వేసుకుని ఎర్రెర్రని కారంబంతి పూల చెండు తల్లో పెట్టుకుంది.

ప్రభబండి, అమ్ములత్త వాళ్ల యింటిముందు ఆగబోతుండగా బుజ్జి చేతిని విడిపించుకుని గుంపుని చీల్చుకుని తుఫాను గాలిలాగా ప్రభ బండి ముందు ఆడుతున్న గ్రామదేవతల మధ్యకి దూకింది అయిమావతి.

“ఆపండ్రా...” ఒక్క పొలికేక పెట్టింది. దిక్కులు పిక్కటిల్లినట్లయి ఎక్కడి వాళ్లక్కడ ఆగిపోయి నిశ్చేష్టులయి చూశారు. గుభిల్లున నేల మీద కూలబడి, “ఊ... ఊ...మ్...మ్...మ్...” శరీరాన్ని గుండ్రంగా తిప్పుతూ వూగిపోతోంది అయిమావతి. ఆ ఉగ్రస్వరూపాన్ని చూసి గంగాణమ్మ మద్దిరావమ్మలు సైతం కంపించిపోయి వెనకడుగులు వేశారు. ముసలివాళ్లు ముందుకువచ్చి మోకాళ్లమీద కూలబడి, “అమ్మా! ఎవరు తల్లే! నువ్వెవరో చెప్పమ్మా?” వేడుకున్నారు.

“నే...ను... నల్లమారెమ్మనురా... మీ గొడ్డూగోదా పిల్లా మేకా అన్నింటిని నమిలి మింగేత్తానురా...” గింగుర్ల గొంతు గాలిలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఎక్కడి వాళ్లక్కడ పిడుగుపడ్డట్టయ్యారు. ముప్ఫయ్యేళ్ల తర్వాత నల్లమారెమ్మ వూరిమీద వాలింది. ఏం ముంచుకువస్తుందోనని అందరూ భయంతో గుసగుసలు పోతున్నారు.

గణాసార్లు తేరుకుని, “ఓ అమ్ములమ్మో, నీ యింటి ముందే కూచుంది అమ్మతల్లి. శాంతి చేయించక పోతే మీ యింటితోనే అశుభం మొదలవుద్ది. రాండి... రాండి...” కేకలు పెట్టారు.

అమ్ములత్త, పిల్లలు, చుట్టాలు ఉరుకులు పరుగుల మీద వచ్చి పసుపు వేపాకు కలిసిన నీరు బిందెలతో తెచ్చి నల్లమారెమ్మ ముందు వారపోశారు. గుగ్గిలం వేసి బండారు జల్లి యింటిల్లపాదీ కాళ్ల మీద

పడ్డారు. నల్లమారెమ్మ కనుగుడ్లు పెద్దవి చేసి వీధి గుమ్మం వేపు చూసింది. కదలకుండా అతిశయంగా నిలబడి వున్నాడు పెదబాబు.

''ఏం పెదబాబూ... నల్లమారెమ్మనే శంకిస్తావురా?!'' గర్జించింది. ఆ దెబ్బకి అగ్గగ్గలాడుతూ వచ్చి మెడలో వేసుకున్న కండువాని నడుముకి కట్టి నీరు వారపోసి, ముందుకు వంగి జీరాడుతున్న నల్లమారెమ్మ చీరకుచ్చిళ్ల మీదుగా పాదాలనంటి దణ్ణం పెట్టాడు.

కళ్లారా చూసింది నల్లమారెమ్మ.

మారెమ్మనే చూస్తోంది బుజ్జి. కళ్లు కలిపేసి ఏదో చెపుదామన్నట్టు చూస్తోంది.

అప్పటికీ ప్రభ బండి ముందు నుంచి కదలకుండా వూగిపోతూనే వుంది నల్లమారెమ్మ. ''నా ఆకలి తీరలేదురో... నా ఆశ చావలేదురో... నాకు తినడానికి యావయినా పెట్టండిరో...'' పంతం పట్టేసింది. ఏం చేయాలో తోచక గుంపుసింపులు పడుతున్నారందరూ. డప్పులు లేవు, నృత్యాలు లేవు, వేషాలు లేవు. నల్లమారెమ్మ ధాటికి కకావికలయిపోయారందరూ.

''అమ్మా... మారెమ్మ తల్లీ... నువ్వు శాంతించి ముందుకు కదలకపోతే ఊరంతటినీ చల్లగా చూడాల్సిన నీ అప్పచెల్లెళ్లూ అలిగి మాయమయిపోతే మా గతేం కావాలి?'' గణాసార్లు ఆవేదనగా అన్నారు.

''అపచారి దొరకాలిరా... దొరికిన వాడిని దండించాలిరా!'' రౌద్రంగా పలికింది నల్లమారెమ్మ.

''ఎవరు తల్లే అపచారి? చెప్పు తల్లే! యిట్టాగాదుగానీ మారెమ్మతల్లే... నివ్వులే... అపచారి అన్నోడు దొరకడు. మనమే ఎతకాల... లే... నారశూల చేతబట్టు. బూవి మీద పాదంమోపు. చిందెయ్యి, ఓరి రఘునాదవో... ఆ నారశూల యిట్టా తెచ్చి మారెమ్మ కుడిచేత బెట్టు. ఓరి మత్తేసో... ఆ యాపమండల గుత్తులు ఎడమచేత బెట్టు. లే మారెమ్మ తల్లీ,'' గణాసార్లు నల్లమారెమ్మ మొహం మీదికి గుగ్గిలం పొగ వేశారు.

నల్లమారెమ్మ లేచి నిలబడింది.

వల.. వల.. వలా.. వలా. వల... వలా... ఊరంతా ఘొల్లున ఘోష పెట్టింది.

భూమి పైకి ఎక్కుపెట్టిన బాణంలా కుడి మోకాలు వంచి గుండెల వరకూ లాగి అరచేయిలా విస్తరించిన గుండ్రని దృఢమైన పాదాన్ని నేల మీదికి మోపింది. .. బండారు కుప్ప లావాలా ఎగిసిపడింది.

''నల్లమారెమ్మ అడుగేసిందిరా! ఒరేయ్... మహాలక్ష్ముడూ... ఓరి సిద్దప్పా... తియ్యండ్రా డప్పులు, కొట్టండ్రా అపచారి చెవులు బద్దలవ్వాలిరా,'' గణాసార్లు ఆవేశంగా పలికారు. నల్లమారెమ్మ చేతిలోని వేప మండలు రవరవలాడాయి. ఒంటినున్న ఆభరణాలు గలగలలాడేయి. కాలు మార్చి కాలు మోపుతూ మారెమ్మ వేస్తున్న చిందుకి డప్పులోళ్లు తాళలేక శరీరాలను ముందుకీ వెనక్కీ మెలికలు తిప్పుతున్నారు.

థిం... థిం... దిద్ధి... నక... థిం... థిం... దిద్ధి... నక... వల... వలా... వలా... వల... వల... వలా...

ఆరె యెయ్...యెయ్... రేసెయ్...

ధింధిం దిద్ధినక ధింధిం దిద్ధినక...

యే... ఏ... ఏ... దిద్ధినక దిద్ధినక దిద్ధినక... డప్పుల శబ్దాన్ని చీల్చుకొని గుండె లవిసిపోయేలా వినిపించింది ఎవరిదో గొంతు.

''ఓరి ఎల్లమందో! నల్లమారెమ్మ నీకెల్లే గుడ్డురిమి చూత్తంది... నీ కాసే వత్తందిరోయ్...''

అందరూ గుండెల మీద చేతులేసుకుని గడబిడ పడిపోతుంటే ''అమా... నల్లమారెమ్మ బావుంది కదూ...'' చారుమతి చెవిలో గుసగుసలాడింది బుజ్జి. భయంగా చూసి బుజ్జి నోరు అరచేత్తో మూసింది చారుమతి.

*వాకిలి అంతర్జాల పత్రిక, మార్చి 2013*

